## మూడవ ప్రకరణం

# దైవప్రవక్త (ﷺ) పై దురూద్, సలాం పంపే ఆదేశం షరీయత్ బద్ధమైనది

అల్లాహ్ తన షరీయత్‌లో తన ప్రవక్త (ﷺ) యెడల ముస్లింలు నెరవేర్చవలసిన బాధ్యతలను విశదీకరించాడు. వాటిలో ఒకటి ఆయన (ﷺ)పై దురూద్ సలాంలు పంపటం. అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ఆదేశించాడు :

﴿إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيمًا﴾(الاحزاب:٥٦)

**నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దురూద్ పంపండి. అత్యధికంగా సలాములు (కూడా) పంపుతూ ఉండండి. (అల్ అహ్‌జాబ్ : 56)**

ఇమామ్ బుఖారీ గారు అబుల్ ఆలియాతో ఇలా అన్నారు :

"అల్లాహ్ దురూద్ పంపించటమంటే అర్థం, ఆయన తన దూతల ముందు తన ప్రవక్త (ﷺ)ను మెచ్చుకుంటాడు. దైవదూతలు దురూద్ పంపటమంటే భావం వారు 'దుఆ' చేస్తారు. మనుషులు ఆయన (ﷺ)కు దురూద్ పంపటమంటే ఆయన (ﷺ) మన్నింపు కొరకు, కారుణ్యం కొరకు అల్లాహ్‌ను అర్థించటం అన్నమాట."

పై సూక్తి ద్వారా మహాప్రవక్త (ﷺ) స్థాయి, అంతస్తు ఎంత గొప్పదో అర్థమవుతోంది. ఊర్ధ్వ లోకాలలో దేవుడు తన సమీప దూతల ముందు ప్రవక్త (ﷺ)ను ప్రశంసించాడు. దైవదూతలు కూడా ఆయన (ﷺ) ఉన్నత స్థానాల కోసం ప్రార్థిస్తున్నారు. భూలోకవాసులు కూడా ఆయన (ﷺ) కారుణ్యం కొరకు ప్రార్థించవలసిందిగా దేవుడు ఆదేశించాడు – ఆ విధంగా ఊర్ధ్వలోకాల వారు, భూలోక వాసులు కూడా ప్రవక్త (ﷺ)ను శ్లాఘించటంలో ఏకమవ్వాలన్నది దేవుని అభిమతం. ఎంతటి ఉన్నత స్థానం!

'సల్లిమూ తస్లీమా' అంటే ఆయన (ﷺ)కు ఇస్లామీయ అభివాదం పంపమని అర్థం. కాబట్టి ఎవరయినా ప్రవక్త (ﷺ)కు దురూద్ పంపదలచినపుడు దురూద్‌తో పాటు సలామ్‌ని కూడా పంపాలి. కేవలం ఒక్క దానితో సరిపెట్టుకోకూడదు. కేవలం 'సల్లల్లాహు అలైహి' అని అనరాదు. కేవలం 'అలైహిస్సలాం' అని కూడా అనరాదు. ఎందుకంటే రెండింటినీ ఒకేసారి పలకాలన్నది దైవాజ్ఞ.

ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపమని ఎన్నో చోట్ల నొక్కి చెప్పబడింది. కొన్ని చోట్ల తప్పనిసరి (వాజిబ్) అని అనబడితే, కొన్నిచోట్ల అలా చేయటం అభిలషణీయం (ముస్తహబ్) అనీ, సున్నతె ముఅక్కదా అని కూడా వక్కాణించబడింది.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) తన పుస్తకం "జలాఅల్ అఫ్హామ్" లో 41 చోట్ల, ఆయన (ﷺ)పై దురూద్, సలాంలను పంపటం మస్నూన్ (సున్నత్) అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలా అన్నారు :

"మొదటి చోట : అన్నిటికన్నా ముఖ్యమైన, గట్టిగా నొక్కి వక్కాణించబడిన చోటు నమాజ్ – నమాజ్‌లోని చివరి తషహ్హుద్ (చివరి ఖాయిదా)లో దురూద్ పంపాలి. ఈ విషయంలో ముస్లిములందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. కాని ఇక్కడ అది వాజిబ్ (తప్పనిసరి) అనే విషయంలో మటుకు భేదాభిప్రాయం ఉంది." (జలాయిల్ అఫ్హామ్ – పేజీ : 222, 223).

తరువాత ఆయన దురూద్ పంపవలసిన సందర్భాలేవో (ప్రసంగాల)లో జుమా ప్రసంగం, పండుగల ప్రసంగం, ఇస్తిస్ఖా ప్రసంగం, ముఅజ్జిన్ అజాన్ పలుకులకు సమాధానం పలికినప్పుడు, మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు, మస్జిద్ నుండి వెడలినప్పుడు, ఆయన (ﷺ) ప్రస్తావన వచ్చినప్పుడు. ఆ తరువాత అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటం వల్ల కలిగే సత్ఫలితాలను, ప్రయోజనాలను విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన 40 ప్రయోజనాలను ప్రస్తావించారు. (జిలాఉల్ అఫ్హామ్ – పేజీ : 302)

వాటిలో కొన్ని ప్రయోజనాలివి :

1. ప్రవక్త (ﷺ)పై దురూద్ పంపటమంటే అల్లాహ్ ఆదేశపాలన చేయటమే.
2. ఒకసారి దురూద్ పంపిన వానిపై అల్లాహ్ తరఫున పది కారుణ్యాలు అవతరిస్తాయి (ముస్లిం).
3. 'దుఆ' ప్రారంభంలో దురూద్ పంపటం వల్ల ఆ దుఆ స్వీకారయోగ్యమయ్యే అవకాశాలు పెరిగిపోతాయి.
4. దురూద్ పంపటంతో పాటు ఆయన (ﷺ)కు ప్రశంసాత్మకమయిన స్థానం కూడా ప్రసాదించమని వేడుకున్నట్లయితే, ఆ వ్యక్తి ఆయన (ﷺ) సిఫారసుకు హక్కుదారుడై పోతాడు.
5. దురూద్ (పంపటం) పాపాల మన్నింపునకు సాధనం.
6. దైవప్రవక్త (ﷺ)పై దురూద్, సలామ్‌లు పంపిన వ్యక్తి దానికి జవాబుగా ప్రవక్త (ﷺ) వారి 'ప్రతిసలాం'కు హక్కుదారుడై పోతాడు.

మహాప్రవక్త (ﷺ)పై దైవ కారుణ్యం మరియు శాంతి వర్షించుగాక!

https://teluguislam.net